ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తాడి తరలింపు..హామీకే పరిమితం

◆ ముందుకుసాగని ముఖ్యమంత్రి మాట ◆ పట్టించుకోని ఎమ్మెల్యే అదీప్‌రాజు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'మరో వారం పది రోజుల్లోనే తాడి గ్రామానికి సంబంధించి వారికి అవసరమైన రూ.56 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తాం' - 2022 ఏప్రిల్ 28న అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో నవరత్నా లు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాలు, హౌసింగ్ స్కీమ్ మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటిది.



కాలుష్య బాధిత తాడి గ్రామం (ఫైల్ ఫోటో)

ఈ హామీ ఇచ్చి మరికొద్ది రోజుల్లో ఏడాది పూర్తవుతుంది. మాట ఇచ్చిన ముఖ్యమంత్రి హామీని మర్చిపోయారు. పట్టుబట్టి నిధులు రాబట్టుకొని దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపాల్సిన ఎమ్మెల్యే అదీప్‌రాజు పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా పరవాడ ఫార్మా కంపెనీలకు వంద మీటర్ల దూరంలోని తాడి తరలింపు సమస్య దశాబ్ధమున్నరగా నలుగుతూనే వుంది. ఫార్మా కంపెనీల కాలుష్యంతో బాధపడుతున్న తమను సురక్షిత ప్రాంతానికి తరలించాలని తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలు ఎంతో కాలంగా తాడి బాధితుల సంక్షేమ సంఘం నేతృత్వంలో పోరాడుతున్నారు. సిఎం హామీతో తాడి ప్రజలు తమను తరలిస్తారని భావించారు. గతంలో టిడిపి ప్రభుత్వం వలే ఈ ప్రభుత్వమూ హామీ ఇచ్చింది తప్ప సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధి ప్రదర్శించలేదు.

ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 6న తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను పెదముషిడివాడ తరలింపునకు టిడిపి ప్రభుత్వం రూ.57.63 కోట్లు విడుదలచేస్తూ జిఒ 29ని విడుదల చేసింది. ఇళ్లకు పరిహారం, రవాణా ఛార్జీలు చెల్లింపు సహా ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలకే ప్రభుత్వం పరిమితమైందిగానీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌ను విస్మరించింది. ఆ తరువాత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.56 కోట్లు చెల్లిస్తామని ప్రకటించింది. ఈ హామీ ఆమోదయోగ్యంగా మిగతా 2లో..

తాడి తరలింపుపై రీ సర్వే చేపట్టాలి



తాడి గ్రామం తరలింపుపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలుచేయాలి. గ్రామంలో రీ సర్వే నిర్వహించి లబ్ధిదారుల జాబితా ప్రకటించాలి. గ్రామసభ నిర్వహించి మేజర్ కుమారులు, కుమార్తెలను గుర్తించాలి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం చెల్లించాలి. ప్రస్తుత ధరల ఆధారంగా ఇళ్లకు పరిహారం ఇవ్వాలి. గ్రామాల తరలింపునకు జిఒ విడుదల చేయాలి.

గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు

ఐఎఎస్‌ల బదిలీలు

◆ జివిఎంసి నూతన కమిషనర్‌గా సాయికాంత్ వర్మ
◆ అనకాపల్లి జెసిగా జాహ్నవి
◆ ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిగా పృథ్వీతేజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, అనకాపల్లి ప్రతినిధి : విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఐఎఎస్ అధికారులు గురువారం రాత్రి బదిలీ అయ్యారు. వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్‌గా సేవలందిస్తున్న పి.రాజబాబును కృష్ణా జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో 2015 బ్యాచ్‌కు చెందిన సిఎం సాయి కాంత్ వర్మ జివిఎంసికి వచ్చారు. సాయి కాంత్ వర్మ ప్రస్తుతం వైఎస్‌ఆర్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సేవలందిస్తున్నారు. అలాగే అనకాపల్లి జెసిగా పని చేస్తున్న కల్పనా కుమారిని సీతంపేట ఐటిడిఎ పిఒగా ప్రభుత్వం బదిలీ చేసింది.



జివిఎంసి నూతన కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆమె స్థానంలో ఎం.జాహ్నవిని నియమించింది. ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి సంతోష్‌రావు స్థానంలో ఐఎఎస్ అధికారి పృథ్వీ తేజ్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జి 20 సమ్మిట్ ఖర్చు రూ.115 కోట్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : గత నెల 28, 29, 30 తేదీల్లో విశాఖ వేదికగా జరిగిన జి 20 ఫైనాన్షియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమావేశాలకు రూ.115.71 కోట్లు ఖర్చయినట్టు జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. ఈ సమ్మిట్ విజయవంతమైనట్టు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మిగతా 2లో..

మోకాళ్లపై ముఠా కార్మికుల నిరసన

▶ వార్త 5లో..

చెరుకు రైతులను ఆదుకోండి

▶ వార్త 5లో..

న్యాయవాదుల విధుల బహిష్కరణ

▶ వార్త 4లో..



వేములవలసలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ఘనంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభం

ఇంటి వద్దకే వైద్యంతో మేలు : మంత్రులు, అధికారులు

వార్తలు 7లో..

జగనన్న కాలనీల్లో..

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వండి

అఖిలపక్ష రాజకీయ పార్టీల డిమాండ్

ప్రజాశక్తి - సీతమ్మధార : జగనన్న కాలనీల ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్లను అప్పగించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. విశాఖ పౌర గ్రంథాలయంలో గురువారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు సొంత ఇళ్లు లేవన్నారు. నిర్మాణానికి కనీసం 60 గజాల స్థలం ఉండాలని, జగనన్న కాలనీలో ఇస్తున్న సెంటు భూమి సరిపోదని అన్నారు. ఇళ్లను నిర్మిస్తే అప్పుల పాలవుతామని లబ్ధిదారులు భయపడుతున్నారని తెలిపారు. మరోపక్క ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇల్లు అవసరం లేదని రాసి ఇవ్వాలంటూ లబ్ధిదారులను అధికారులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని పేర్కొన్నారు. అలా రాసి ఇస్తే భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ఇల్లు రాదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నజీర్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నిర్మించిన కొన్ని ఇళ్లకు నేడు వైసిపి ప్రభుత్వం రంగులు వేసిందన్నారు. జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని విమర్శించారు. మధురవాడలో 300 ఎకరాలను అతి తక్కువ ధరకు అదానీ డేటా సెంటర్ పేరిట కట్టబెట్టారన్నారు. ముడసర్లోవ ప్రాంతాన్ని రిక్రియేషన్ జోన్‌గా మార్చి దోచుకోవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు



అభివాదం చేస్తున్న అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు

ఎస్.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వమే నాణ్యతతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వాటా లక్షా 80 వేలు, లబ్ధిదారుడి వాటా 35 వేలు వెరసి 2 లక్షలా 15 వేలతో ఇంటిని నిర్మించుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే చాలా మిగతా 2లో..

మిషన్ వాత్సల్యకు ఆదాయ పరిమితి పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అనాథ పిల్లలకు, తల్లి లేదా తండ్రి చనిపోయిన పిల్లలకు వారి పోషనార్థం ప్రతి నెలా రూ.4 వేలు ఇవ్వాలని తీసుకువచ్చిన మిషన్ వాత్సల్య పథకానికి ఆదాయ పరిమితి పెంచాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం ఒంటరి మహిళలకు కొంత ఉపసమనం కలిగిస్తుందని తెలిపారు. కాకపోతే పట్టణ ప్రాంతాల్లో ఈ పథకానికి సంవత్సరానికి రూ.96 వేలు, అంతకన్నా తక్కువ ఆదాయం వచ్చే తల్లి లేదా తండ్రి అర్హులుగా ప్రకటించారని, ఈ ఆదాయ పరిమితిని సంవత్సరానికి రూ.2 లక్షలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం వున్న జీవన ప్రమాణాల నేపథ్యంలో నెలకు కనీసం రూ.15 వేలు ఆదాయం వచ్చినవారు కూడా బతకలేని పరిస్థితి పట్టణ ప్రాంతంలో వుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇడబ్ల్యుఎస్ కోటా కింద ఆదాయ పరిమితిని సంవత్సరానికి రూ.8 లక్షలుగా, పట్టణ ప్రాంతాల్లో పేదరిక ఆదాయ పరిమితిని నెలకు రూ.12 వేలుగా నిర్ణయించిందన్నారు. కానీ ఈ పథకానికి కేవలం నెలకు రూ.8 వేల ఆదాయ పరిమితిగా నిర్ణయించడం వల్ల అత్యధిక మంది ఒంటరి మహిళలను, వితంతు మహిళలను ఈ పథకం నుంచి దూరం చేసినట్లు అవుతుందన్నారు. ఇప్పటికే ఒంటరి మహిళలు నేరుగా ప్రధాన మంత్రికి ఈ ఆదాయ పరిమితిని రూ.96 వేలు నుంచి రూ.2 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి లేఖలు పంపించారని తెలిపారు.

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే తేదీని కూడా పొడిగించాలని కోరారు. ఒంటరి మహిళలు ఈ పథకం విషయమై సహాయ సహకారులు పొందేందుకు 7382626772 నెంబరును సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి..

తాడి తరలింపు..హామీకే పరిమితం

లేనప్పటికీ కనీసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఇంతవరకు తరలింపునకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించలేదు. ఇళ్లతో పాటు భూములకు పరిహారం చెల్లిస్తే సురక్షిత ప్రాంతానికి వెళ్లిపోవాలని తామంతా సిద్ధంగా వున్నామని తాడి ప్రజలు చెబుతున్న మాటలను ప్రభుత్వం పెడచెవినపెడుతోంది. 2017లో సర్వే చేసిన నాటికి మైనర్లుగావున్న పిల్లలు ఇప్పుడు మేజర్లుకావడంతో వాళ్లను సర్వేచేసి మేజర్లందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రస్తుత ధరల ప్రకారం ఇళ్ల నిర్మాణాలకు డబ్బులివ్వాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వండి

చోట్ల టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు తక్షణమే ఇవ్వాలని అన్నారు. సబ్బవరం, పద్మనాభం మండలాల్లో రెండు వేల ఎకరాలు కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ప్రతినిధి వి.హరి గణేష్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్.భాస్కర్ మాట్లాడుతూ పేదలు ఇంటి నిర్మాణం కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, సిపిఎం క్షేత్రపాల్, సిపిఎం జిల్లా నాయకులు ఎం.కృష్ణారావు, ఆప్ నాయకులు ఎస్.రమేష్, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జి 20 సమ్మిట్ ఖర్చు రూ.115 కోట్లు

మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన ఈ సమ్మిట్‌లో 20 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. సమ్మిట్ కార్యక్రమాల్లో భాగంగా జివిఎంసి మూడు కేటగిరీలలో 400 మౌలిక వసతులు, సుందరీకరణ పనులకు సుమారు రూ.115.71 కోట్లు ఖర్చు చేసిందన్నారు. విమానాశ్రయం నుంచి భీమిలి వరకు ఉన్న 48.14 కిలోమీటర్ల ప్రాంతంలో 127 పనులకుగాను 32.62 కోట్లు, ఫిషింగ్ హార్బర్ నుంచి పార్క్ హోటల్ వరకు 5 కిలోమీటర్ల ప్రాంతంలో 26 పనులకు 8.11 కోట్లు వెచ్చించామన్నారు. ముఖ్యమైన మార్గాల్లో ప్రతినిధుల పర్యటనలో భాగంగా పలు ప్రాంతాల అభివృద్ధి కోసం చేపట్టిన 230 పనులకుగాను రూ.70.72 కోట్లు ఖర్చుయ్యాయన్నారు. జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ఈ సమావేశాలకు వెచ్చించిన పూర్తి నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఖర్చు చేశామన్నారు. పనులన్నీ శాశ్వత ప్రాతిపదికన జరిగాయన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరు సతీష్ పాల్గొన్నారు

స్థాయీ సంఘంలో అన్ని అంశాలూ ఆమోదం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి స్థాయీ సంఘంలో పొందుపరిచిన అన్ని అంశాలూ ఆమోదం పొందాయని నగర మేయర్, స్థాయీ సంఘం అధ్యక్షులు గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో స్థాయీ సంఘం అధ్యక్షులు, స్థాయీ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ స్థాయీ సంఘంలో మొత్తం 57 అంశాలు పొందుపరచగా అన్ని అంశాలనూ సుదీర్ఘంగా చర్చించిన పిమ్మట సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో రెవెన్యూ విభాగానికి సంబంధించిన ఆశీలు, కల్యాణ మండపాలు, షాపు రూములు, మొదలైన వాటి ద్వారా దాదాపు రూ.197 కోట్లు రాబడికి సంబంధించిన అంశాలను ఆమోదించారన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పార్కులు, తాగునీరు ఆధునీకరణకు రూ.1.26 కోట్లు, జి-20 సదస్సుకు ప్రైవేటు కార్మికులను నియమించిన నేపథ్యంలో రూ.28.33 కోట్లు, ఆంధ్రా యూనివర్సిటీలో చెట్లు మార్పునకు, మొక్కలు నాటేందుకు సుమారు రూ.39.67 కోట్లు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, ఆధునీకరణకు రూ.26.25 లక్షలకు ఆమోదం లభించినట్లు వెల్లడించారు.

జాన్ వెస్లీ జన్మదిన వేడుకలు

ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పుట్టినరోజు వేడుకలు వైసిపి కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నేతలు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచంద్ర, కనకల ఈశ్వర్ పాల్గొన్నారు.

పోలీసు క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 71వ ఆలిండియా పోలీసు అథ్లెటిక్ క్లస్టర్ మీట్‌లో ఖోఖో విభాగంలో కాంస్య పతకం సాధించిన రాష్ట్ర పోలీస్ ఖోఖో టీంలో సభ్యులుగా ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను విశాఖ నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ అభినందించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన అథ్లెటిక్స్ క్లస్టర్ మీట్‌లో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు బృందం ఖోఖోలో కాంస్య పతకం సాధించగా అందులో వైజాగ్ సిటీ ఆర్మ్‌డు రిజర్వ్ కానిస్టేబుళ్లు ఎం.కనకరాజు, బి.నాగరాజు ఉన్నారన్నారు. వారిని అభినందిస్తూ ప్రోత్సాహక నగదు బహుమతులను, జిఎస్‌ఇలను ప్రకటించారు. కార్యక్రమంలో ఎడిసిపి (అడ్మిన్) ఎమ్‌ఆర్‌కె.రాజు, ఎసిపి శాంతి కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి హేయం

కలెక్టరేట్ : అనకాపల్లిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని అనుచరులు కాలేజీ విద్యార్థులపై చేసిన దాడిని ఖండిస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షులు పివి.శివప్రసాద్ రెడ్డి మాట్లాడారు.

ఆకట్టుకున్న వస్తు ప్రదర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్, దయాల్‌బాగ్‌లో డిఇఐ సెంటర్ విద్యార్థులు ఏర్పాటుచేసిన వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది. సెయింట్ జోసెఫ్ కాలేజీకి చెందిన బిఎస్‌సి థర్డ్ ఇయర్ హోమ్ సైన్స్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా దయాల్‌బాగ్ ఇనిస్టిట్యూట్‌లో టై అండ్ డై బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ మూడు నెలల కోర్సులో శిక్షణ తీసుకున్నారు. అనంతరం వారు తయారు చేసిన వస్తువులను గురువారం ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనను ప్రొఫెసర్ వివిజి.శాస్త్రి ప్రారంభించి, వస్తువులను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో దక్షిణామూర్తి పాల్గొన్నారు.

'ప్రయివేటు'కు 10లోగా దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో ఒకటో తరగతిలో పేద పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 10వరకు గడువు ఉన్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మార్చి 22 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. అర్హత గల విద్యార్థులు http//cse.ap.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

అప్పన్న చక్రస్నానం

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీవరహా లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవంలో భాగంగా గురువారం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ఈశాన్యంలో ఉన్న గంగాధరలో చక్కర నారాయణ సేవ జరిపారు. ఆలయంలో చూర్ణత్సవం, వసంతోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామివారి అభిషేకం జరుగుతున్న జలాలతో భక్తులు స్నానం ఆచరించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాస్ ఆచార్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 10న సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార నిమిత్తం ఈ నెల 10న మధురవాడలోని డిఇ కార్యాలయం వద్ద సదస్సు నిర్వహించనున్నట్లు జోన్-3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మధురవాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి సబ్ డివిజన్ల పరిధిలోని వినియోగదారులు వచ్చి సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సదస్సుకు న్యాయ నిపుణులు హాజరవుతారని తెలిపారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఎల్.కోట మండలం పి.అగ్రహారం గ్రామానికి చెందిన పి.గాయత్రి వైద్య ఖర్చుల నిమిత్తం మండలంలోని తాటితూరు గ్రామానికి చెందిన శాలి వాహన యువజన సేవా సంఘం ప్రతినిధులు గురువారం రూ.10 వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాట్నూరు ఎర్రిబాబు, తాటిపూడి త్రినాధ్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

102 శాతం ప్రకటనల పన్ను వసూలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రకటనల పన్ను (నాన్ ఏజెన్సీ) 102 శాతం వసూలైనట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ దవళ శ్రీనివాసరావు తెలిపారు. రూ.11 లక్షలా 62 వేలా 578 డిమాండ్ కాగా, రూ.11 లక్షలా 85 వేలా 578 వసూలైనట్లు వివరించారు. అలానే ఏజెన్సీ పన్ను డిమాండ్ రూ.6 లక్షలా 56 వేలా 514 కాగా, రూ.5 లక్షలా 75 వేలా 688 వసూలైనట్లు చెప్పారు.

రోడ్డు భద్రతా నియమాలతో ప్రమాదాల నివారణ

పజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం పేర్కొన్నారు. ఆనందపురం మార్కెట్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డుల ద్వారా గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ లేకపోవడం వల్ల గత సంవత్సరం 147 మంది ద్విచక్ర వాహనదారులు చనిపోయారని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తారకేష్, తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హెల్మెట్ ధరించాలి

తగరపువలస : ద్విచక్ర వాహనాలను నడిపే వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని భీమిలి ట్రాఫిక్ ఎస్సై సిహెచ్.చిరంజీవిరావు సూచించారు. ఈ మేరకు గురువారం గోస్తనీ జంక్షన్ వద్ద ప్లకార్డులను ప్రదర్శిస్తూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక నేతలకు చంద్రబాబు అభినందనలు


పద్మనాభంలో టిడిపి సీనియర్ నాయకులకు సన్మానం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపునందుకుని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో రెండో స్థానంలో నిలిచిన టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబును పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అభినందించారు. పిఎం పాలెం వి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో అభినందనలు తెలిపారు. ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, ఇతర అంశాల్లో ఓవరాల్ పెర్ఫార్మెన్స్‌లో కోరాడ రెండో స్థానంలో నిలిచినట్లు స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. ఇందుకు గాను చంద్రబాబుకు కోరాడ కృతజ్ఞతలు తెలిపారు.

పద్మనాభం : విశాఖలో బుధవారం నిర్వహించిన జోన్-1 సమావేశంలో పద్మనాభం మండల టిడిపి కేడర్‌ను చంద్రబాబు అభినందించారని పార్టీ మండల అధ్యక్షులు కోరాడ రమణ తెలిపారు. పద్మనాభంలోని టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించినందుకు, బాదుడే బాదుడే.., ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు చంద్రబాబు అభినందించినట్లు పేర్కొన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కోరాడ రమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కశిరెడ్డి దామోదరరావు, రేవిడి మాజీ సర్పంచ్ పాండ్రంగి అప్పలనాయుడు తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.లీలావతి, బోదల పావని, కె.సత్యనారాయణ, కె.లక్ష్మి, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన 5 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులకు చెందిన 190 మంది బాలికలకు స్థానిక ఎమ్మెల్యే ము త్తం శెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా సైకిళ్లు పంపిణీ చేశారు. దివీస్ సహకారంతో మండలంలోని 14 గ్రామ సచివాలయాలకు సుమారు రూ.14 లక్షలా 75 వేలు విలువైన మినీ ఆర్‌ఒ ప్లాంట్లను అందజేశారు. పారిశుధ్య నిర్వహణకు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు నిమిత్తం రూ.1.10 లక్షల చెక్కును ఎండిఒ పి.వెంకటరమణకు అందజేశారు. చిప్పాడలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్.రావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.


సైకిళ్లు అందుకున్న బాలికలు

చిట్టివలస జ్యూట్ బకాయిలపై ఉదాసీనత ఎందుకు? : టిడిపి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసికి చిట్టివలస జ్యూట్ మిల్లు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయి వసూలుపై ఒకటో జోన్ అధికారులు ఉదాసీనత ఎందుకు ప్రదర్శిస్తున్నారని టిడిపి నగర కార్యదర్శి పిట్టా సురేష్ ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.22 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయి ఉన్న చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యంపై చట్ట పరమైన చర్యకు ఎందుకు వెనుకాడుతున్నారని అధికారులను ప్రశ్నించారు. జ్యూట్ మిల్లు యాజమాన్యం అమ్ముకునే ఆస్తులకు ఎన్‌ఒసిలు ఇవ్వడంలో ఉత్సాహం చూపుతున్న అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి సోమన్నపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి రాత్రి సుమారు 9 గంటల సమయంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... సోమన్నపాలెం గ్రామ తలయారీగా పనిచేస్తున్న తుమ్ము కృష్ణమ్మ (73), అతని తమ్ముడు కామరాజు ఇంటికి వెళ్తున్నారు. బోయిపాలెం నుంచి సోమన్నపాలెం వైపు అతి వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి నడిచి వెళ్తున్న కృష్ణమ్మ ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన కృష్ణమ్మను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అతను మృతి చెందాడు. మృతుని కుమారుడు సాధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి బెదిరింపులపై మాజీ ఎంపిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : వైసిపికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు సుంకర గిరిబాబు, గంధవరం సర్పంచ్ జివికె వర్మ (మురళీరాజు) ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారని సిటీ పోలీస్ కమిషనర్‌కు మాజీ ఎంపిపి దంతులూరి గోపాలకృష్ణమూర్తి (గోపిబాబు) గురువారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి... మండలంలోని కొవ్వాడ, గంధవరం, నారాయణపురం, నరసాపురం, రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో పేదలకు ఇళ్ల నిమిత్తం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌ను ఆసరా చేసుకొని గిరిబాబు, జివికె వర్మరాజు, మరి కొంత మంది నాయకులు కలిసి రైతులను మోసం చేసి, విలువైన భూమిని సొంతం చేసుకొని అక్రమంగా ప్లాట్‌లు పొందారని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు తన దృష్టికి తీసుకురావడంతో ఆర్‌టిఐ ద్వారా సమాచారం తీసుకున్నానని పేర్కొన్నారు. ఆర్‌టిఐ ద్వారా తహశీల్దార్ ఇచ్చిన సమాచారంలో గిరిబాబు, ఆయన వర్గీయులు కలిసి బినామీల పేర్లతో సుమారు 65 నుంచి 70 ఎకరాల భూమిని అక్రమంగా పొంది, తునివలస లే-అవుట్‌లో ప్లాట్లు తీసుకున్నారని తెలిపారు. అప్పటిలో రైతుల వద్ద తీసుకున్న భూమిలో మామిడి, జీడి తదితర చెట్లు ఉంటే వాటిని తొలగించి ప్లాట్లు వేశారని తెలిపారు. రైతుల వద్ద తీసుకున్న భూమికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇవ్వాల్సిన పరిహారం, భూమి ఇవ్వలేదని వివరించారు. దీనిపై ఈ నెల 3వ తేదీన జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయడంతో తనకు బెందిరింపు కాల్స్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

న్యాయశాస్త్రంలో పరిశోధనలపై గీతం వర్క్‌షాప్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన న్యాయశాస్త్రంలో పరిశోధనలపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్, ఢిల్లీలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పరిశోధకులు ప్రొఫెసర్ మార్గరేట్ ఫిలిప్స్ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో "రైట్ టూ యాక్సెస్ టూ జస్టిస్" అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. ప్రపంచం అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధిస్తున్నా వివిధ దేశాలలో ఇప్పటికి తమకు జరిగిన అన్యాయాలను న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లాలన్న అవగాహన ప్రజలలో ముఖ్యంగా సమాజంలో అట్టడుగు వర్గాల వారికి లేకపోవడం విచారకరమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే దేశంలో న్యాయాలు, చట్టాల పట్ల ప్రజలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉందని, వారి తరుపున న్యాయం కోసం పోరాడడానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు, సంస్థలు అవసరమని ఆమె పేర్కొన్నారు. దేశంలో న్యాయస్థానాల పట్ల, చట్టాల పట్ల అవగాహన కలిగించడానికి నల్సా వంటివి లీగల్ లిటరసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, న్యాయ విద్యను అభ్యసించే యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి న్యాయ సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చట్టాలలోని సున్నితమైన అంశాలపై న్యాయ విద్యార్థులు పరిశోధనలు జరపాలని, పరిష్కార మార్గాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ లా డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.అనితారావు మాట్లాడుతూ, నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితుల వల్ల మారుమూల ప్రాంతాల ప్రజలు న్యాయస్థానాలకు వెళ్ళలేని పరిస్థితులలో ఉన్నారని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ నెహ్రూనగర్‌లో ఉపకార్ ట్రస్టు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు ప్రారంభించారు. పాదచారులకు, ప్రయాణికులకు, విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి నేపథ్యంలో అవసరమైన చోట మర్ని కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిపల్లి రామారావు, బత్తిన వెంకటేష్, రవికుమార్, ఉపకార్ సంస్థ సభ్యులు సుధీర్, నాగ, శివ, భాష పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి-లీగల్ : కొత్త ఢిల్లీలో న్యాయవాది హత్యకు నిరసనగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యాన గురువారం కోర్టు విధులు బహిష్కరించి సంఘీభావం ప్రకటించారు. ఇటీవల కొత్త ఢిల్లీలో న్యాయవాది వీరేంద్ర కుమార్ నర్వాల్‌ను దుండగులు నరికి చంపారని, రాజమండ్రిలో రాత్రి 12 గంటల తర్వాత ఆసుపత్రి నుంచి వస్తున్న న్యాయవాది డి.సుభాష్‌ను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని, ఈ ఘటనలకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు న్యాయవాదులు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ, న్యాయవాదులపై జరుగుతున్న ఇటువంటి దాడులను అరికట్టేందుకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజమండ్రిలో ఘటనలో సంబంధిత పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసి ఆంధ్రప్రదేశ్ డిజిపికి, విశాఖపట్నం కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు.

10న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐటిఐ కోర్సులు పూర్తిచేసి అప్రెంటిస్‌షిప్ చేయని వారి కోసం కంచరపాలెంలోనిపాత ఐటిఐ కళాశాల ఆవరణలో ఈ నెల 10న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2023 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్, జోన్-1 ఉపసంచాలకులు ఆర్‌వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ అన్ని ట్రేడ్ల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ మేళాలో ప్రభుత్వ రంగ సంస్థలు ఐఆర్ఇఎల్ (ఇండియా), ఎల్‌టిడి, సుమారు 15కి పైగా ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని తమ సంస్థల్లో అవకాశం కల్పిస్తాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మిషన్ వాత్సల్య అందరికీ చేరాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : 18 ఏళ్లలోపు ఉన్న అనాథ పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం ఎంతగానో దోహదపడుతుందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకునేలా అంగన్వాడీ కార్యకర్తలు కృషి చేయాలని శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి పేర్కొన్నారు. ఆర్ అండ్ బి వద్ద ఉన్న విశాఖ శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి అంగన్వాడీ పరిధిలో పథకం గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులను గుర్తించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వెంకటేశ్వరి, సిడిపిఒ ఎంవి.రమణికుమారి, అడిషనల్ సిడిపిఒ శ్రీలత పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా పంపిణీ

ప్రజాశక్తి-ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి ఎక్స్ సర్వీస్ మెన్ కాలనీలోని అంబేద్కర్ గ్రౌండ్‌లో వైఎస్ఆర్ ఆసరా పంపిణీ చేపట్టారు. ఆసరాకు అర్హులైన డ్వాక్రా మహిళలకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీసురేష్, వార్డు అధ్యక్షులు రావాల సత్యనారాయణ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో సుమారు రూ.34.45 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, పార్టీ పరిశీలకులు ఎస్ఎ.రెహమాన్, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, కృప, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గులిగిందలు లావణ్య, కార్పొరేటర్ కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : సమాజ సేవలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపల్ షైజీ సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు 1, 2 ప్రత్యేక సేవా శిబిరాల ముగింపులో ఆమె మాట్లాడారు. నిస్వార్థంగా సమాజానికి సేవ చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ, యునైటెడ్ వే ముంబై మరియు అవేజాన్ సహకారంతో అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు సుమారు 750 పరిశుభ్రత కిట్లు, గర్భిణులకు 500 పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశామన్నారు. సెబాస్టియన్ కాలనీ, జ్ఞానాపురం, ఆర్‌పి.పేట, కప్పరాడ, బర్మా కాలనీ ప్రజలకు మూడు ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ జె.నిర్మల, అధ్యాపకులు డాక్టర్ ఎన్.నాగరాజు, డాక్టర్ పద్మ సుందరి, డాక్టర్ మేరీ అనుపమ, డాక్టర్ మౌసమీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ సహాయ మంత్రితో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల భేటీ


కేంద్ర స్టీల్ సహాయ మంత్రిని కలిసిన ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఢిల్లీలో ఉన్న ఉద్యోగ భవనంలో స్టీల్ సహాయ మంత్రి ఫ్గాన్‌సింగ్ కులస్తేతో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగ సంఘాల నేతలు భేటీ అయ్యారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ తరుపున సిజిఎం కల్లూరి శ్రీనివాస్, హెచ్ఆర్ విభాగ జిఎం కంచెర్ల సంజీవరావు, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హాజరై స్టీల్‌ప్లాంట్‌లో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సమస్యలు వివరించారు. మూడేళ్లుగా ఎగ్జిక్యూటివ్ ప్రమోషన్స్ ఇవ్వలేదని, సిజిఎమ్ క్యాడర్‌లో ఎస్‌సి, ఎస్‌టిలు ఒక్కరైనా లేరని, వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ ఎక్జిక్యూటివ్‌లకు జూనియర్ ఆఫీసర్ టెస్ట్ నిర్వహించాలని కోరారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, రిజర్వేషన్లు కాపాడాలని, వరల్డ్ ట్రైబల్ డేను యాజమాన్యం అధికారికంగా నిర్వహించాలని, పిఆర్‌సి కమిటీలో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించి యాజమాన్యం ఇప్పటి వరకూ ఎస్‌సి, ఎస్‌టిల కోసం తీసుకుంటున్న వెల్ఫేర్ చర్యలు గురించి చర్చించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని తగు ఆదేశాలు జారీ చేశారు.

సుబ్బారావు సేవలు ఎనలేనివి


సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావు సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. జివిఎంసి 25వ వార్డు పరిధి బానోజీతోటలో ఆర్.నాగేశ్వరరావు ఆధ్వర్యాన సుబ్బారావు సంతాపసభ నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎన్.రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సుబ్బారావు ఆశయాల దిట్ట అన్నారు. ఆయన మార్గంలో పయనించడమే కార్మికరాజ్యానికి సరైన మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు, బి.శ్రీనివాస్, ఎం.జ్యోతి, శ్యామ్, మీనాక్షి, నాగరాజు, వార్డులోని అభిమానులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

డాక్టర్ ఆర్‌వి.రవికన్న

ప్రజాశక్తి -గాజువాక : జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని కిమ్స్ ఐకాన్ డాక్టర్ ఆర్‌వి.రవికన్నా సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని 1948 నుంచి ఏటా ఏప్రిల్ 7న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశమని చెప్పారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ ఏడాది హెల్త్ ఫర్ ఆల్ థీమ్‌తో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా కరోన కేసులు పెరగడం కలవర పెట్టే అంశమని, గతంలో సూచించిన జాగ్రత్తలు పాటించడం ద్వారా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు అని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం, శరీరంలో నీటి కొరత రాకుండా రోజుకు కనీసం 8 నుంచి 9 గ్లాసుల నీరు తాగడం ముఖ్యమని చెప్పారు. నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని మలినాలు చాలా వరకు తొలగిపోతాయని వివరించారు.

పలుచోట్ల గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -యంత్రాంగం

మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి రుషికొండ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు, చెన్నదాసు, పోలిరెడ్డి, యు.గోపి, కార్తీక్, మాదు చంటి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు పరిధి మురళీనగర్-1 పల్నాటి కాలనీ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు, నీలి రవి కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి సుజాత, నూకరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పదో తరగతి ద్వితీయ భాష పరీక్షకు 27,426 మంది హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి ద్వితీయ భాష పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ద్వితీయ భాష పరీక్షకు 27,537 మంది హాజరు కావల్సి ఉండగా 27,426 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా అబ్జర్వర్ ఎం.జ్యోతికుమారి రెండు పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ 7, స్క్వాడ్ బృందాలు 31 కేంద్రాలను సందర్శించారని తెలిపారు.

రక్తదానం చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ కాలనీలో గురువారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మృతిచెందిన రాఘవ పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, వంశీరెడ్డి చేతులమీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకుటి చందు, 67వ వార్డు కార్పొరేటర్ పల్ల శ్రీను, వినోద్, శ్రీను, ఢిల్లీరావు, బొడ్డ గోవింద్, రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు, అంబేద్కర్ కాలనీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'మతం మారితే రిజర్వేషన్లు వద్దు'

ప్రజాశక్తి-సీతమ్మధార : మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు వర్తింప చేయకుండా చట్టాలు తేవాలని జన జాతి గిరిజన సురక్ష మంచ్ నేషనల్ కన్వీనర్ పి.సూర్యనారాయణ డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన పాడేరు మండల కేంద్రంలోని తలారి సింగ్ మెయిన్ రోడ్డులో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన సంఘం వారి అసలు సంస్కృతిని, మతాన్ని విడిచిపెట్టి క్రైస్తవం, ఇస్లాం స్వీకరించిన పౌరులను వెంటనే షెడ్యూల్ తెగల వర్గం నుంచి మినహాయించాలని, దీనికి అవసరమైన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ మతంలోకి మారిన కారణంగా షెడ్యూల్ కులాల రిజర్వేషన్‌తో ఎన్నికైన ఒక శాసనసభ్యుడిని ఇటీవల కేరళ హైకోర్టు అనర్హుడుగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాకూరు కరుణాకర్, కిముడు దేవి పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవీఎంసీ 25వ వార్డు పరిధి గొల్లవీధిలో అనధికారికంగా 3వ అంతస్తులో సగభాగం వేసిన భవనాన్ని, 27వ వార్డు శ్రీనగర్‌లో అనధికారికంగా వేసిన కాలమ్స్‌ను తొలగించినట్లు జోన్-3 టిపిఎస్ తేజ తెలిపారు ఏసిపి వెంకటేశ్వర్లు ఆదేశాలు మేరకు అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలను గుర్తించి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ అనిత, టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రెటరీ పాల్గొన్నారు.

స్కేటింగ్ విద్యార్థికి నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీకి చెందిన గొలగాని దినేష్ స్కేటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించి త్వరలో జరగబోయే ఏషియన్ గేమ్స్‌కు ఎంపికైనందున విద్యార్థిని అభినందిస్తూ దివీస్ సౌజన్యంతో రూ.2.25 లక్షల చెక్కులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రీడల్లో రాణించి దేశానికి, మన నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పిన్నింటి రమణ, భీమిలి మండలం సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి సరగడ రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు వల బహూకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : పిఎం.పాలెం వి.కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన టిడిపి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సుకు హాజరైన చంద్రబాబుకు వల, బుంగ, టోపీని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్, కోరాడ రాజబాబు, పాశర్ల ప్రసాద్, కె.ఎల్లాజీ, వి.సత్యారావు పాల్గొన్నారు.

'రసూల్ డెకర్' వద్ద మోకాళ్లపై ముఠా కార్మికుల నిరసన

ప్రజాశక్తి అచ్యుతాపురం

అచ్చుతాపురం సెజ్‌లో రసూల్ డెకర్ ప్లైవుడ్ కంపెనీ ఆవరణలో దిబ్బపాలెం గ్రామానికి చెందిన ముఠా కార్మికులు రెండో రోజు గురువారం తమ ఆందోళనను కొనసాగించారు. మోకాళ్లపై నిలబడి నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో పరిశ్రమ స్థాపించినప్పటి నుండి 100 మంది ముఠా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ట్రాక్టర్లు, లారీలు, వ్యాన్లో పరిశ్రమ వద్దకు వచ్చిన కలపను ముఠా కార్మికులు అన్లోడింగ్ చేస్తారని, అందుకు పరిశ్రమ కొంత డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. ఈ మధ్యకాలంలో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆదేశాలతో ముఠా కార్మికులకు చెల్లిస్తున్న మామూలు పద్ధతిని యాజమాన్యం అర్ధాంతరంగా నిలిపివేసిందని, గేటు లోపలికి రావద్దని యాజమాన్యం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పరిశ్రమ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే కలిసి ముఠా కార్మికుల పొట్ట కొట్టడం దారుణమన్నారు. స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసినా, ప్రైవేటు యాజమాన్యాలు దాన్ని పక్కనపెట్టి ఉన్న ఉపాధిని కూడా పోగొట్టే పద్ధతులు అనుసరిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం ముఠా కార్మికుల కోర్కెను అంగీకరించి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున నిర్వాసితులను, కార్మికుల సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెజ్ నిర్వాసిత ప్రతినిధి తుమ్మల రాజు పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరహాల నాయుడు, గొర్లి నాగేష్, గుర్రం సూరిబాబు, గొర్ల సత్తిబాబు, ఏ చిన్న అప్పలనాయుడు, ఏ గోవిందరావు, ముఠా కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న రసూల్ డెకర్ ముఠా కార్మికులు

ఢిల్లీ న్యాయవాది హత్యపై నిరసన

ప్రజాశక్తి -యలమంచిలి

ఢిల్లీ మధుర ప్రాంతంలో జరిగిన న్యాయవాది వీరేంద్రకుమార్ హత్యకు నిరసనగా గురువారం యలమంచిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సభ్యులు కోర్టును బహిష్కరించారు. కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.శ్రీనివానపట్నాయక్, కూనిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదులపై పైశాచిక దాడులను అరికట్టాలన్నారు. న్యాయాన్ని బతికించుకోవాలంటే శాంతి భద్రతలు ఉండాలని పేర్కొన్నారు. తమతో పాటు జిల్లాలోని అనకాపల్లి, చోడవరం బార్ అసోసియేషన్‌లు కూడా నిరసన కార్యక్రమంలో పాల్గొని కోర్టులు భహిష్కరించినట్లు వారు తెలిపారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చెరుకు రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - అచ్యుతాపురం

చెరుకుకు గిట్టుబాటు ధర లేకపోవడం, సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో చెరుకు రైతులు ఆర్థిక నష్టాల్లో పడి దివాలా తీస్తున్నారని, వారిని ప్రభుత్వాలు ఆదుకోవాలని చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం జరిగిన రైతుల ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో 29 సుగర్ ఫ్యాక్టరీలు గతంలో ఉండేవని, నేడు ఐదు సుగర్ ఫ్యాక్టరీలు మాత్రమే క్రషింగ్ చేస్తున్నాయని తెలిపారు. గతంలో ఐదు లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రతి ఏటా చెరుకును పండించేవారని, నాలుగేళ్లుగా ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గడంతో ఆ సాగు కుంటుపడిందని తెలిపారు. ఒక వైపు పెట్టుబడులు పెరగడం, మరోవైపు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు రుణాల ఊబిలో చిక్కుకుపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరితో విసిగి వేసారిపోయారని తెలిపారు. చెరుకు రైతుకు కనీస మద్దతు ధర ప్రకటించకపోవడం విచారకరమన్నారు. సమస్యలపై పోరాడుతున్న 90 మంది రైతులపై కేసులు బనాయించారన్నారు. వారిలో 37 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. చెరుకు రైతులకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ సుగర్ ఫ్యాక్టరీ వద్దా టన్నుకు మూడు వేల రూపాయలకు మించి ఇవ్వలేదన్నారు. ఒక్క సుగర్ ఫ్యాక్టరీనీ ఆధునికీకరించలేదని తెలిపారు. రైతులంతా దశలవారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాంబాబు, జి.నాగబాబు, జాతీయ నాయకులు రవీంద్రన్, విజ్జు కృష్ణన్ పాల్గొన్నారు.



ఢిల్లీలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న కర్రి అప్పారావు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు

నేవీ నిర్వాసితులకు ప్రగడ సంఘీభావం

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి నిర్వాసితులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం శిబిరాన్ని గురువారం టిడిపి యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎఒబితో నిర్వాసితులైన కొప్పుగొండుపాలెం గ్రామస్తులకు కూడా జీవన భృతి ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేవల్ బేస్‌కు భూములు కోల్పోయి నిర్వాసితులు తమకు న్యాయం చేయండి మహాప్రభో అంటూ రోజులు తరబడి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈ గ్రామ నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల నిర్వాసితులకు జీవన భృతి ప్యాకేజీ ప్రకటించి, కొప్పుగొండుపాలెం వారికి ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ గ్రామానికి కూడా జీవన భృతి ప్యాకేజీ కచ్చితంగా ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు, నాయకులు కశిరెడ్డి ప్రసాద్, మండల అధ్యక్షులు వి.దినబాబు, సూరాడ అప్పలరాజు, మాజీ సర్పంచ్ బి.రమణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

మూడో వారంలో టిడ్కో గృహాలు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏప్రిల్ మూడో వారంలో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందజేయనున్నట్టు చైర్మన్ ప్రసన్నకుమార్ తెలిపారు. మండలంలోని సత్యనారాయణపురంలో నిర్మించిన 2,744 టిడ్కో గృహాలను ఏప్రిల్ మూడవ వారంలో ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. హౌసింగ్ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్ణీత కాలంలో అసంపూర్తి పనులను పూర్తిచేసే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఇప్పటికే విజయనగరం, తూర్పు, పశ్చిమగోదావరి, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో 50వేల గృహాలను అందించామని చెప్పారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే విషయంలో జీవీఎంసీ, టిడ్కో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో టిడ్కో ఎస్ఈ నరసింహమూర్తి, జోనల్ కమిషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, డిఈ ఉమామహేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆసరా

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : వ్యవసాయ పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడిన బాధిత కుటుంబానికి రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ ఆసరాగా నిలిచింది. రూ.30 వేలతో 6 మేక పిల్లలను కొనుగోలు మృతుని భార్య వెన్నెల కోట సత్యవతికి గురువారం దిబిడి గ్రామంలో అందజేశారు. మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన వెన్నెలకోట అర్జున వ్యవసాయ పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చలేక, అప్పులు ఇచ్చిన వారి తాకిడిని తట్టుకోలేక 2021 అక్టోబర్ 16న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి ఆసరాగా ఉండటానికి మేక పిల్లలు ఇచ్చినట్లు సంస్థ కార్యదర్శి గాడి శ్రీను తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొన్నాబత్తుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్, సంస్థ సిబ్బంది సతపతి నాగబాబు, తాటికొండ రమణ, తాటికొండ గణేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మేక పిల్లలను అందజేస్తున్న దృశ్యం

మళ్లీ సుందరీకరణ పనులు

- గతంలో స్టేషన్ రోడ్డు డివైడర్ బ్యూటిఫికేషన్ చేసిన మున్సిపాలిటీ
- నిర్వహణ కరవై మోడువారిన మొక్కలు
- రూ.14 లక్షల ప్రజాధనం నిరుపయోగం
- ఈ సారైనా పరిరక్షిస్తారా?

ప్రజాశక్తి -యలమంచిలి

యలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు డివైడర్ బ్యూటిఫికేషన్ (అవెన్యూ) పనులను మున్సిపాలిటీ మరోసారి చేపట్టింది. ఈ సుందరీకరణ పనులను గురువారం ప్రారంభమయ్యాయి. ఇందుకుగాను యలమంచిలి మున్సిపాలిటీ అవెన్యూ ప్లాంటేషన్ పేరిట రూ.5 లక్షలు ఖర్చు చేయబోతోంది. అయితే ఈ సారైనా సుందరీకరణలో భాగంగా నాటిన మొక్కలను పరిరక్షిస్తారా? అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

యలమంచిలి బస్ కాంప్లెక్ నుండి రైల్వేస్టేషన్ వరకు రోడ్డును 2012-13లో రూ.20 లక్షలతో విస్తరించి, మరో రూ.12 లక్షలు వెచ్చించి మొక్కలు నాటడానికి అనుకూలంగా రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించారు. అందులో మట్టివేసి, మొక్కలు నాటి, అందంగా తీర్చిదిద్దడానికి మరో రూ.2 లక్షలు ఖర్చు చేశారు. ఇదంతా పాలకవర్గంలేని సమయంలో మున్సిపాలిటీ అధికారుల ఆధ్వర్యంలో జరిగింది.

మొదట్లో ట్యాంకర్ల ద్వారా నీరు అందించినపుడు మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో పాటు, బోగన్‌విల్లా మొక్కలు పూసిన రంగు రంగుల పూలు ఆహ్లాదపరిచేవి. రూ.14 లక్షలతో చేసిన ఈ సుందరీకరణతో పచ్చదనం వెల్లివిరిసి అందంగా కనిపించాల్సిన స్టేషన్ రోడ్డు, మున్సిపాలిటీ నిర్వహణ కరువై మొక్కలు మోడువారి కళా విహీనంగా తయారైంది. ఎప్పటికప్పుడు ట్రిమ్ చేయాల్సిన మొక్కలను వదిలేయడంతో ఏపుగా ఎదిగిపోయి పశువులు, మేకల మేతకు గురయ్యాయి. అందంగా కత్తిరించాల్సి ఉండగా, పనులు త్వరగా కానిచ్చేయడానికి కొమ్మలకు బదులు మొదళ్లు నరకడంతో అవి మోడువారిపోయాయి. ఎన్ని వర్షాలు పడినా అవి చిగురించలేదు. మొక్కలు నాటిన మున్సిపాలిటీ సంరక్షణ బాధ్యత గాలికొదిలేయడంతో అవి కాస్తా కనుమరుగయ్యాయి.

మళ్లీ ఇప్పుడు మొక్కలు నాటే కార్యక్రమానికి మున్సిపాలిటీ శ్రీకారం చుట్టింది. నిర్వహణ పట్ల అశ్రద్ధ వహిస్తే ఎన్నిసార్లు మొక్కలు నాటినా నిరర్ధకంగా మారతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. పట్టణంలోని కొన్ని వీధుల్లో లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలు సైతం నరికి వేతకు గురవుతున్నాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పచ్చదనానికి మరో విఘాతం కలిగించే అంశం ఏమిటంటే మున్సిపాటిటీతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా విద్యుత్ శాఖ సిబ్బంది కొన్ని వీధుల్లోని ఏపుగా పెరిగిన చెట్లను ఇష్టానుసారం నరికేస్తున్నారు. వీటన్నింటినీ మున్సిపల్ అధికారులు దృష్టిలో ఉంచుకొని మొక్కలు నాటడంతో పాటు వాటి నిర్వహణను సక్రమంగా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రొక్లైనర్‌తో డివైడర్‌లో ఉన్న మొక్కలు మోడులు తీసేస్తున్న దృశ్యం

సంరక్షణ బాధ్యతలు చేపడతాం

ఎండలు తగ్గేక చేపట్టబోయే స్టేషన్ రోడ్డు డివైడర్ బ్యూటిఫికేషన్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న మోడు మొక్కలను తొలగిస్తున్నాం. మొక్కలు నాటి పర్యవేక్షణ లోపం లేకుండా చర్యలు తీసుకుంటాం. అవసరమైనపుడు మొక్కలకు నీరు అందించే సంరక్షణ బాధ్యతలు చేపడతాం. వీటి నిర్వహణ బాధ్యతలు సిబ్బందిలో కొందరికి అప్పగిస్తాం.

- కృష్ణవేణి, యలమంచిలి మున్సిపల్ కమిషనర్

ప్రజలకు మరింత చేరువుగా ప్రభుత్వం

రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ముఖ్యమంత్రికే తెలియజేసుకునే అవకాశం ఉందని చెప్పారు. పార్టీ నినాదంతో ముద్రించిన స్టిక్కరును గృహ యజమాని అనుమతితో అతికిస్తామని చెప్పారు.

దేశ నాయకులకు నివాళులర్పిస్తున్నప్పుడు నినాదాలు సబబేనా?

బాబు జగ్జీవన్ రామ్‌కు బుధవారం తాను నివాళులర్పిస్తున్న సమయంలో డివిఎన్ కళాశాల విద్యార్థులు నినాదాలు చేయడం సబబేనా అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. ఇటువంటి చర్యలను ఏ పార్టీ నాయకులు సహించరన్నారు. పోలీసులు కళాశాలలోకి వెళ్లి విషయం తెలుసుకున్నారు తప్ప ఎవరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు దీని రాజకీయం చేయడం సరికాదన్నారు. తాను దాడి వీరభద్రరావు కుటుంబంలో సభ్యుడనేనని, డివిఎన్ కాలేజీ తన సొంత కళాశాల వంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మళ్ల బుల్లిబాబు, పలక రవి, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బివి సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కార్పొరేటరు జాజుల ప్రసన్న లక్ష్మి, వైసిపి నాయకులు కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, కెఎం.నాయుడు, దాడి నారాయణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న ఎంపిపి బోకం సూర్యకుమారి

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనులపై గురువారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం తూతుమంత్రంగా సాగింది. వాస్తవంగా మండలంలోని 24 పంచాయతీల్లో ఏయే పనులు చేపట్టారు, ఎంతవరకు ఖర్చు చేశారు, మిగిలిన పనులు ఎన్ని ఉన్నాయి, ఎంత ఖర్చు చేయాల్సి ఉంది, ఉపాధి పనుల్లో ఏమైనా అవినీతి జరిగిందా? వంటి అనే అంశాలపై ఈ ప్రజావేదికలో చర్చించి తగిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంది. అయితే గురువారం జరిగిన ప్రజావేదికకు సర్పంచులు, ఎంపిటిసీలు పెద్దగా హాజరు కాకపోవడంతో అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించి ఈ ముగించేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో మొత్తం 429 పనులకు గాను వేస్ట్ కాంపొనెంట్ కింద సుమారు రూ.80.95 లక్షలు, మెటీరియల్ ఖర్చు కింద సుమారు రూ.24.24 లక్షలు వెరసి సుమారు కోటి 51 లక్షల 95 వేల రూపాయలు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజావేదికలో జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ సామాజిక తనిఖీలో సర్పంచులు, ఎంపిటిసీలు పెద్దగా హాజరు కాకపోవడానికి కారణం అధికారులు తెలియజేయాల్సి ఉందని, వారికి ముందుగా సమాచారం అందించారా? లేదా? అని ప్రశ్నించారు. సోషల్ ఆడిట్ ఆఫీసర్ రోజా రమణి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల్లో అవకతవకలకుగాను లక్షా 80వేల 950 రూపాయలు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నీషియన్లకు ఫైన్ విధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోకం సూర్యకుమారి, ఎంపీడీవో బి.రమేష్ నాయుడు, ఏపీఓ శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మల, అంబుడ్స్ మెన్ అన్నపూర్ణ, క్లస్టర్ ఏపీడి మణికుమార్ పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు, మండల వాలంటీర్ల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ పిలుపునిచ్చారు. మండలంలోని పిండ్రంగి, లంకవానిపాలెం గ్రామాల్లో గురువారం గృహ సారథులు, వాలంటీర్ల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ సారథులు ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టి అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. అందుకు కావాల్సిన ప్రచార సామాగ్రిని ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పిండ్రంగి సర్పంచి రామలక్ష్మి, ఎంపీటీసీ గోపి, వైసిపి నాయకులు వెంకటరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి : మండలంలోని కోడూరు, సిహెచ్ఎన్ అగ్రహారం, రేబాక, శంకరం, గొలగం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, గోపాలపురం గ్రామాల్లో గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల స్పందనను 8296082960 నెంబరుకు నేరుగా ఫోన్ చేసి తెలియ చెప్పాలన్నారు.

గొలుగొండ: మండలంలోని కొంగసింగి, కేడిపేట సచివాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కొరుప్రోలు పాణి శంతారాం, నర్సీపట్నం మార్కెట్ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, గొలుగొండ మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, నాయకులు బుల్లి ప్రసాద్, కొంగ సింగి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సత్యనారాయణ, పత్తి రమణ పాల్గొన్నారు.

గోపాలపట్నం : 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి శ్రేణులను జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. స్థానిక కుమారి కళ్యాణ మండపంలో 91, 92 వార్డుల కన్వీనర్లు, ఆర్పీలు, వాలంటీర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గేదెల మురళీకృష్ణ, గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లె అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు

కలెక్టరేట్ : 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాలపై జీవిఎంసి గాంధీ విగ్రహం నుంచి జైల్ రోడ్డు జంక్షన్ వరకు ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ నాయకత్వంలో సాగిన ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, స్టేట్ రెల్లి కుల కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమగ్ర శిక్ష అధికారి తనిఖీలు

ప్రజాశక్తి-చోడవరం : అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ లక్ష్మి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంబేరుపురం, గజపతినగరం, వెంకన్నపాలెం పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రారంభం పరీక్ష, అంత్య పరీక్షల స్థాయి నమోదును పరిశీలించారు. అంబేరుపురంలో రాగిజావ పంపిణీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెంకన్నపాలెం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సిఆర్‌పి కెవిఎమ్.నాయుడు,హెచ్‌ఎంలు రమేష్, నాగరాజు, రమణమ్మ, శివాజీ, జగ్గారావు, మను పాల్గొన్నారు.

ఆయుర్వేద, యోగా శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కోడూరు ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థలో ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే ఆయుర్వేద యోగ శిక్షణకు రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్నట్లు యోగాచార్యులు రామలింగ వెంకట సత్యనారాయణ, వైద్య సుందర రాజ పెరుమాళ్ తెలిపారు. ఈ శిక్షణలలో అష్టాంగ యోగ, ఆయుర్వేద జీవన విధానంపై తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణలో ఉచిత ఆవాసం, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు.

మద్యం ద్వారా రూ.41 వేల కోట్లు దోపిడీ

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మద్యం దోపిడీలో రూ.41 వేల కోట్లు కొట్టేశారని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం జాతీయ అంతర్జాతీయ బ్రాండ్లు రద్దు చేసి తన బినామీలు, వైసిపి నేతలకు చెందిన డిస్టలరీలో తయారైన నాసి రకం మద్యాన్ని విక్రయించి వేలకోట్ల రూపాయలు పేదల నుంచి పిండుతున్నారని విమర్శించారు. మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్‌కు అనుమతి ఇవ్వకుండా నగదు లావాదేవీల్లో గోల్‌మాల్ చేసి ప్రభుత్వానికి రావలసిన రూ.28 వేల కోట్లు, కమీషన్ల రూపంలో రూ.13,500 కోట్లు తాడేపల్లి కార్యాలయానికి తరలించారని ఆరోపించారు. టిడిపి నాయకులు ధనాల విష్ణు చౌదరి, కర్రి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని కన్నంపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో డ్రైనేజీ, మంచినీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, కుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో చైతన్య పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని వైలోవ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు గురువారం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన తెలిపారు. జెడ్‌పిటిసి నాగరాజు, కె.నర్సింగరావు, కిషోర్, శ్రీనుబాబు, కొబిరి రామకృష్ణ, తహశీల్దార్ పి.భాగ్యవతి, ఎంపిడివో కొండలరావు, స్థానిక సర్పంచి బద్రి నారాయణరావు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు మంత్రి పూజలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఆవ సోమవారం గ్రామంలో గురువారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి అమర్నాథ్‌ను ఎంపీటీసీ సభ్యుడు ఈత బాబురావు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ద్వారపురెడ్డి బాబ్జి, పిన్నమరాజు రవీంద్ర, నర్మల రామకృష్ణ, పల్లి వెంకటేశ్వరరావు, దాసరి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల జాతరలు

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని కొత్తపట్నం, వాడ నర్సాపురం గ్రామాల్లో గురువారం నూకాంబిక, దుర్గాదేవి, అమ్మవార్ల జాతరలు ఘనంగా జరిగాయి. టీడీపీ మండల అధ్యక్షులు వి.దినబాబు, నాయకులు కశిరెడ్డి ప్రసాద్, మాజీ సర్పంచులు చోడిపల్లి సత్యనారాయణ, చింతకాయల ఎర్రయ్య, నాగేష్, మంగరాజు, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆయా గుడిల వద్ద నిర్వాహకులు అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

విశాఖ వెళ్లి పింఛన్లు అందజేసిన వాలంటీర్లు

ప్రజాశక్తి- వడ్డాది : అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్, విశాఖ డెయిరీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పింఛనుదారులు బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన కుర్మాసుల మోహనరావుకు, బంగారుమెట్ట గ్రామానికి చెందిన శరగడం జగన్నాధం ఆయా గ్రామాల వాలంటీర్లు ప్రశాంత్, కె.మంజూష గురువారం ఆయా ఆసుపత్రులకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

డివిఎన్ విద్యార్థులపై దాడి సరికాదు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డివిఎన్ కళాశాల విద్యార్థులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని, అనుమతి లేకుండా కళాశాలలోకి చొచ్చుకుపోయి విద్యార్థులపై దాడి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఈ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రమణ తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల పట్ల పోలీసుల తీరు మార్చుకోవాలని, విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఈ చర్యకు పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థలకు, విద్యార్థులకు ఉన్న హక్కులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి వెంకటేష్, సాయి వెంకట తనూజ, హేమంత్ పాల్గొన్నారు.

రైతులకు ట్రాక్టరు, పవర్ టిల్లర్ అందజేత

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని జి.భీమవరం రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం జైకిసాన్ గ్రూపునకు ట్రాక్టర్, పవర్ టిల్లర్‌ను జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం యంత్ర పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, సర్పంచ్‌లు కలగా గున్నయ్య నాయుడు, హనుమంతు వెంకట లక్ష్మణరావు, స్థానిక ఎంపిటిసి అల్లం శంకరరావు, జిల్లా సహకార బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఏం అభివృద్ధి చేశారని జగన్‌ను నమ్మాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై నమ్మకం పోయినందునే మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం చేపట్టారని, రాష్ట్రాన్ని ఏం అభివృద్ధి చేశారని ప్రజలు జగన్‌ను నమ్మాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రశ్నించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఓడిపోయిన దగ్గరనుంచి జగన్‌కు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో రాష్ట్రానికి చేసిన అభివృద్ధిపై ప్రజలు ప్రశ్నించాలన్నారు. మంత్రి అమర్నాథ్ విద్యార్థులపై కక్షగట్టి దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు విద్యాలయంలో దూరి విద్యార్థులపై దాడి చేయడం బాధాకరమన్నారు. మళ్ల సురేంద్ర, జోగినాయుడు, బొద్దపు ప్రసాద్, పోలవరపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, దాడి జగన్, ఆకుల నానాజీ, మలసాల నానాజీ పాల్గొన్నారు.

తగ్గిన మందుల ధరలను అమలు చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అత్యవసర మందుల జాబితాలో 651 మందుల ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను తక్షణమే అమలుపరచి, దుకాణాల్లో ధరల పట్టికలను ప్రదర్శించాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాలని చేసిన ఆదేశాలు నేటికీ అమలు కాలేదన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో 651 మందులపై 6.73 శాతం ధరలు తగ్గుతాయన్నారు. ధరలు తగ్గిన దుకాణదారులు పాత ధరలకే మందులు విక్రయించి వినియోగదారులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దుకాణాలు వద్ద ధరల పట్టికలను ప్రదర్శించాలని కోరారు.

నాయీ బ్రాహ్మణ సంఘం భవనానికి రూ.20 లక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా నాయీ బ్రాహ్మణ, జిల్లా వాయిద్యకారుల సంఘం భవనానికి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి తన ఎంపీ లాడ్స్ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతిని ఆమె స్వగృహంలో గురువారం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సంఘం నాయకులు కే అప్పారావు, కందికుప్ప గోవిందరావు, పేకేటి వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి పేలూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్యం

-మంత్రులు బూడి, అమర్‌నాథ్ - పలు చోట్ల ప్రారంభం

ప్రజాశక్తి-యంత్రాంగం

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందుతుందని పలువురు నాయకులు తెలిపారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రతి పేదవాడికి ఇంటి వద్దనే నిత్యం ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉంటుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన విలేజ్ వెల్నెస్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి డాక్టర్ అందుబాటులో ఉండే విధంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి మాట్లాడుతూ మండలానికి రెండు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ఇద్దరు డాక్టర్లతో పాటు ఇతర సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి, కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపిపి రెడ్డి జగన్మోహన్, అదనపు జిల్లా వైద్య శాఖ అధికారి జ్యోతి, వైద్యాధికారులు, పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న బూడి

కశింకోట : ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. మండలంలోని జె.తునిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయాన్ని డాక్టర్లు సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్, ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, వైస్ ఎంపిపి నమ్మి మీణా, సర్పంచ్‌లు కలగా గున్నయనాయుడు, కొన అరుణ, కొన నాగేశ్వరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది : ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. వడ్డాదిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి దొండా రాంబాబు, వైద్యులు సిహెచ్.శకుంతల, ఆర్.మౌనిక, వైసీపీ నేతలు దొండా నారాయణమూర్తి, కోరుకొండ సూరప్పారావు, ఉప సర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని వెన్నలపాలెం సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నెల అప్పారావు, ఎంపీటీసీ వెన్నెల అరుణ కుమారి, ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకారావు, పిహెచ్‌సి డాక్టర్ రంజిత్, ఇఒఆర్డీ పద్మజ, వైసిపి నాయకులు పైల సత్యనారాయణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యులు కార్యక్రమం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చెప్పారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, కోన లచ్చన్‌నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి: సిఎం జగన్ ఫ్యామిలి డాక్టర్ పథకాన్ని ప్రవేశ పెట్టినందుకు గాను నక్కపల్లిలో వైసీపీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జడ్పిటిసి కాసులమ్మ, సీనియర్ నాయకులు మణిరాజు తదితరులు మాట్లాడుతూ, ఎంపిపి ఏనుగుపల్లి రత్నం, నేతలపై బుధవారం జరిగిన దాడి ఘటన దుర దృష్టకరమన్నారు. మండలంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అండగా నిలవడం అభినందనీయ మన్నారు. ఇక నుంచి ఐకమత్యంగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. వీసం రామకృష్ణ మాట్లాడుతూ, తన కుటుంబాన్ని నమ్ముకున్న కార్యకర్తలకి జీవితాంతం అండగా నిలుస్తామన్నారు. ఎంపిపి రత్నం మాట్లాడుతూ, దళిత మహిళా అని చూడకుండా కొంతమంది తనపై దాడికి పాల్పడ్డారని, అండగా నిలిచిన వారందరికీ రుణ పడి ఉంటానని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు జయ రత్నకుమారి, సాదిరెడ్డి శ్రీనివాస్, సురేష్ వర్మ, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు వీసం నానాజీ, భార్గవ్, గంటా తిరుపతిరావు, కొప్పిశెట్టి హరి, కొల్లాటి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో రామచంద్రపాలెం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను వెంకటాపురం పిహెచ్సి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ పరదేశమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు ప్రారంభించారు. గ్రామాల్లో పేద ప్రజలకు ఇకపై ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సందీప్, పత్యూష, గ్రామీణ ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కోటవురట్లలో ప్రారంభిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: మండలంలో రేవు పోలవరం గ్రామం లో ఎమ్మెల్యే గొల్ల బాబురావు మాట్లాడుతూ, గతంలోలా వైద్యం కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేదని, ప్రస్తుతం మన ఊరిలోనే మన ఇంటి వద్దకే ఉచిత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ రామచంద్రమూర్తి, మండల వైస్ ప్రెసిడెంట్ అప్పన్న, గ్రామ సర్పంచ్ లోవరాజు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యామిలీ డాక్టర్ విధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ మల్లికార్జునరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పేదలందరికీ ఉచిత వైద్యం అందించాలని ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం మండలంలో ఉన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు, స్థానిక వైద్యాధికారి కోరాడ శైలజ, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ రామారావు, నాయకులు బంక సత్యనారాయణ, గన్‌రెడ్డి శ్రీనివాసరావు, బిఆర్‌బి నాయుడు, బోని ఆప్పలనాయుడు, పినిశెట్టి సింహాచలంనాయుడు, పాండ్రంగి శ్రీను, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు

పద్మనాభం : మండలంలోని కోవ్వాడలో పిహెచ్‌సి ఆధ్వర్యాన కార్యక్రమాన్ని వైద్యాధికారి కె.స్వప్న ప్రారంభించారు. ఈ కార్యక్రమములో వైద్య సిబ్బంది రాము, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని గోరపల్లిలో ఫ్యామిలీడాక్టర్, 104 నూతన వాహనాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ, జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను, ఎమ్‌పిపి.నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పిలి దేవి, వైస్ ఎంపిపి చిరికి దేముడు, వైద్యాధికారులు డాక్టర్ పూర్ణేశబాబు, జీవనారాణి, జగదీష్ ప్రసాద్, పద్మావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

చిన తీనార్లలో గ్రామసభ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినతీన్నార్ల గ్రామ పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపి ఆర్‌డి వెంకటనారాయణ, పలువురు అధికారులు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శిధిలం లో ఉన్న పంచాయతీ భవనాన్ని తొలగించి, ఆ స్థలంలో అంగన్వాడి భవనం నిర్మించుటకు గ్రామ సభలో తీర్మానం చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ముసలయ్య, ఎంఈఓ డివిడి ప్రసాద్ పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ చేస్తున్న నేతలు

నూతన పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని ఎం.కోడూరులో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాడుగుల టౌన్ వైసిపి అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామ సమస్యలు తెలుసుకుని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు విన్నవించి సమస్యలు పరిష్కరిస్తామని నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, పంచాయతీ సర్పంచ్ గంజి రాజేష్, పడాల అప్పలనాయుడు, పడాల అప్పల నరసయ్య, చింత వెంకటనారాయణమూర్తి, కలిమి గోసమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారదులు వైసీపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఉదయశ్రీ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అదికారి ఉదయశ్రీ తెలిపారు. ఎండపల్లి గ్రామంలో గురువారం జగనన్న కాలనీ నిర్మాణాలను సందర్శించారు. అనంతరం ఆమె మండల పరిషత్ సమావేశ మందిరంలో సిబ్బందితో సమావేశమై గృహ నిర్మాణాలపై సమీక్షించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ జగదీశ్వరరావు, పిఆర్ జెఈ వర్మ, ఏపీఎం రమణకుమారి, ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పెదతీనార్ల గ్రామ పంచాయతీని గురువారం ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకటనారాయణ తనిఖీ చేసారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ సమస్యలపై చర్చించారు. త్వరితగతిన గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సచివా లయ సేవలను ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మేదర వీధిలోని వెలగా నారాయణరావు షాపు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ, నర్సీపట్నంకు అనేకమంది నిత్యం వస్తుంటారని, వేసవి దృష్టిలో పెట్టుకుని వాహనదారులు, పాదచారుల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు పెనుగొండ రమేష్, కార్యదర్శి పూసర్ల గుప్తా, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి ఎస్ కుమార్, వాసవి కళ్యాణ మండప సంఘం అధ్యక్షుడు జాలుమూరి బంగారాజు, రామాలయ కమిటీ చైర్మన్ పద్మనాభుని కన్నయ్య శెట్టి, వూడా సూర్యారావు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో జనసేన పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ జన్మదిన వేడుకలను గురువారం జనసైనికులు ఘనంగా నిర్వహించారు. మనోహర్ జన్మదిన సందర్భంగా నక్కపల్లిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు జనసైనికులు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు కురందాసు అప్పలరాజు, పిక్కి స్వామి, ప్రసాదుల గణేష్, బాలేపల్లి ఏసుబాబు, ఉగ్గిన రాము నక్కా శ్రీనివాస్, రామకృష్ణ, పిల్లి నాగేశ్వరరావు, దమ్ము రాజు పాల్గొన్నారు.

నాదెండ్లకు జన్మదిన శుభాకాంక్షలు

నర్సీపట్నంటౌన్: జనసేన సీనియర్ నాయకులు, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌కు ఆ పార్టీ నర్సీపట్నం రూరల్ ప్రెసిడెంట్ ఊడి చక్రవర్తి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం స్థానిక ఎన్జీవో హోంలో ఆయన మాట్లాడుతూ, నాదెండ్ల పార్టీ కి అండగా ఉంటూ నాయకులను ఉత్తేజ పరుస్తున్నా, ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు.

పిడుగుపాటుకు పాడి పశువు మృతి

ప్రజాశక్తి-రావికమతం: మండలంలోని కొత్తకోట గ్రామంలో గురువారం పిడుగుపాటుకు ఒక పాడి పశువు అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో పిడుగు ఒక్కసారిగా పడటంతో గ్రామానికి చెందిన వెల్లంకి ఈశ్వరరావుకు చెందిన పశువు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. కొత్తకోట, జెడ్ కొత్తపట్నం వెళ్లే రహదారిలోని పొలంలో ఈ ఘటన చోటు చేసుకుంది.



మాట్లాడుతున్న ఎంపిడిఒ డేవిడ్‌రాజు

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరు పనుల్లో పాల్గొనాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు సూచించారు. గురువారం ఆయన మండలంలో రావణాపల్లి గ్రామంలో ఉపాధి పనులను, జగనన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనాన్ని పొందేందుకు రెండు పూటలా పనులకు హాజరు కావాలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉండి పనుల్లోనికి రాని వారిని తప్పనిసరిగా పనుల్లోకి తీసుకువచ్చే విధంగా విఆర్పిలు సమాయత్తం చేయాలన్నారు. కూలీల మస్తర్లను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. చెల్లింపుల విషయంలో ఎటువంటి సమస్యలు తెలిపిన తన దృష్టికి తీసుకు రావాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ గోపి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

104 వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: వైద్య రంగంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి పెను మార్పులు తీసుకు వచ్చారని జెడ్పిటిసీ సుర్ల వెంకటగిరిబాబు తెలిపారు. గురువారం మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో 104 వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ, రాబోయే కాలంలో చీడిగుమ్మల గ్రామంలో మరో పీహెచ్‌సి నిర్మాణాన్ని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ శ్యామ్‌కుమార్, చీడిగుమ్మల ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగమణి

ఘనంగా ఆటిజం దినోత్సవం

ప్రజాశక్తి-రావికమతం: మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఆటిజం అవగాహన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలను, సేవలను ఉచితంగా అందిస్తుందన్నారు. ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు రమణాజీ, జయప్రభ, మాధవి, విశ్వనాథం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, విజయ, పద్మావతి శ్రీనివాస్, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పెంచిన ఆస్తి, చెత్త పన్నులు నిలుపుదల చేయాలి

వార్డు, నివాస్ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పెంచిన ఆస్తి, చెత్త పన్నులను నిలుపుదల చేయాలని, హెల్త్ ఎరీనా వంటి ప్రదేశాలలో ప్రవేశ రుసుం ఉపసంహరించాలని, ట్రూ అప్ ఛార్జీల వసూలు ఆపాలని వార్డు, నివాస్ కమిటీల సమావేశం జివిఎంసిని కోరుతూ తీర్మానం చేసింది. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వార్డు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బి.బి.గణేష్, నివాస్ అధ్యక్షులు బి.గురప్ప, వివిధ జోన్ల నాయకులు వి.వి.ప్రభాకర్‌రావు, జి.రఘురామారావు, జి.నాయుడు బాబు, పి.జయ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఆస్తి పన్నును రికార్డు స్థాయిలో రూ.421.50 కోట్లు వసూలు చేసినట్లు జివిఎంసి ప్రకటించిందన్నారు. గత ఏడాది రూ. 324 కోట్లు మాత్రమే వసూలు అయినట్లు పేర్కొన్నారన్నారు. పన్ను రేట్లు పెంచకుండా ఇలా రికార్డు స్థాయిలో వసూలు చేస్తే అభినందించవచ్చన్నారు. కానీ 2021 ఏప్రిల్ నుంచి ఇంటి పన్నును ఆస్తిపన్నుగా మార్చారన్నారు. ఇందువల్ల భారీ ఆదాయం వచ్చిందన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 15 శాతం



సమావేశానికి హాజరైన నాయకులు

పన్ను పెంచారన్నారు. ఉదాహరణకు ఇంటి పన్ను అంతకుముందు రూ.100గా ఉండగా అది రూ.115 అయిందన్నారు. 2022 నుంచి మరో 15 శాతం పెంచారని తెలిపారు. ఇలా 2022 ఏప్రిల్‌కు ఆస్తి పన్ను రూ.132 పెరిగిందన్నారు. ఇంత భారీగా పెరిగినందున వసూలైన సొమ్ము భారీగా పెరిగిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మరో 15 శాతం పన్ను పెంచుతారన్నారు. అంటే 52 శాతం పన్ను పెరిగినట్టు లెక్క అన్నారు. నిర్ణీత సమయానికి పన్ను చెల్లించకపోతే భారీగా 24 శాతం పెనాల్టీ విధిస్తున్నారని చెప్పారు. ఇది అసలు పన్నును మించిపోతోందన్నారు. మార్చి 31లోగా పన్ను చెల్లిస్తే పెనాల్టీ మాఫీ అనడంతో కనీసం పెనాల్టీ అయినా తప్పుతుందని అప్పో, సప్పో చేసి ప్రజలు పన్నులు చెల్లించారని చెప్పారు. అంతేతప్ప జివిఎంసి చేసిన మార్పును, పెంచిన పెనాల్టీలను అంగీకరించినట్లు కాదన్నారు. హైకోర్టులో ఆస్తి పన్నుపై కేసు పెండింగ్‌లో ఉండగా ఇలా పన్నులను ప్రజలపై రుద్దడం అన్యాయమన్నారు. పట్టణ సంస్కరణల పేరుతో చెత్త సేకరణకు నెలకు రూ.120 వసూలు చేయడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. దీనిని రద్దు చేయకుండా ఆస్తి పన్నులో కలిపి వసూలు చేయాలని జివిఎంసి నిర్ణయించడం సరికాదన్నారు. నీటి మీటర్లు బిగింపును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. టోల్ ఛార్జీలను భారీగా పెంచడంపై మండిపడ్డారు. పార్కులు, హెల్త్ ఎరీనా వంటి ప్రదేశాల్లో ప్రవేశ రుసుమును పెట్టడం దారుణమన్నారు. పార్కులు, స్టేడియాలను వ్యాపార వనరులుగా మార్చరాదన్నారు. ట్రూ అప్ ఛార్జీల వసూలు ఆపాలని డిమాండ్ చేశారు. జి 20 అంతర్జాతీయ కార్యక్రమం కోసం జివిఎంసి పెట్టిన ఖర్చును కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టాలన్నారు.

మిషన్ వాత్సల్యకు అర్హులను గుర్తించాలి

ప్రజాశక్తి- రావికమతం: మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి వరహాలు తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించిన సర్పంచ్ మిషన్ వాత్సల్య పథకం, గ్రామానికి సంబంధించిన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీలోని బుడ్డిబంధ, కవగుంట అంగన్వాడి కేంద్రాల పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం వర్తించే విధంగా అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేయించాలని సూచించారు. తల్లి లేక తండ్రిని కోల్పోయిన, భర్తతో విడాకులు తీసుకున్న పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఈ పథకం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. బుడ్డి బంధం అంగన్వాడీ కేంద్ర పరిధిలో ఐదుగురిని, కవగుంటలో 12 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

హెటిరో పైపులైన్‌కు వ్యతిరేకంగా..

పంచాయతీ తీర్మానం చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: హెటిరో కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానం చేయాలని వార్డు మెంబర్లు, గ్రామస్తులు కోరారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేట పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సాధారణ సమావేశంలో 8 అంశాలలో 7వ అంశం తామంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కంపెనీ వ్యర్థ జలాలను పాత పైప్ లైన్ ద్వారా సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగక పోవడంతో చాలామంది మత్స్యకారులు వలస పోతున్నారని తెలిపారు. కంపెనీ కాలుష్యంతో అనేకమంది రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కంపెనీతో జరుగు నష్టాలను దృష్టిలో పెట్టుకుని పైప్‌లైన్ వేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర పర్యావరణ శాఖ, అటవీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన సిఆర్‌జెడ్ అనుమతులు



వినతి పత్రం ఇస్తున్న వార్డు మెంబర్లు, గ్రామస్తులు

రద్దు చేసే విధంగా పంచాయతీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోసల స్వామి, పిక్కి తాతీలు, చేపల సోమేష్, పీక్కి వీర్రాజు, మహేష్ బాబు, మైలపల్లి నరేష్, పీక్కి శ్రీను, పీక్కి కాశీ, పీక్కి కోటేశ్వరరావు, వాసుపల్లి వెంకటేష్, దైలపల్లి రమణ, పీక్కి లోవరాజు, పీక్కి ఆదిరాజు, మైలపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డుకు కేటాయించిన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నారని పప్పుశెట్టిపాలెం పంచాయతీ ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలబాబు ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గొలుగొండ1 నర్సీపట్నం రోడ్డు పరిధిలో ఆరిలోవ రోడ్డు వెడల్పుకు గొలుగొండ రెవెన్యూ అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది కూలీలతో గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలలో సుమారు రెండు నెలల పాటు కొండపై ఉన్న అడవిని తొలగించారన్నారు. ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు వేయలేదని, స్థానిక గ్రామ నాయకుడు రెవెన్యూ అధికారులు అండదండలతో 7- 43 సెంట్లు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేసి దొడ్డి దారిలో పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశానన్నారు. పప్పుశెట్టిపాలెం పంచాయతీ నాగన్న దొరపాలెం రెవిన్యూ పరిధిలో 70 సర్వే నెంబర్ 7- 43 సెంట్లు భూమి నువ్వుల కొండను కొంతమంది ఆక్రమించుకోవడంతో జానకిరామపురం, నర్సంగపల్లి పప్పుశెట్టి పాలెం గ్రామాల రైతులకు పశువుల మేత కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పప్పుశెట్టిపాలెం పంచాయతీ ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలబాబు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: పెదబొడ్డేపల్లిలో మరిడి మహాలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవంను పురస్కరించుకొని జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పంపిణీ చేశారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అనాధలకు భోజనాలు, నిత్యావసర రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి శ్రీను, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎరువుల తయారీపై అవగాహన

ప్రజాశక్తి -రావికమతం: చెత్తతో సంపద తయారీ కేంద్రంలో గెత్తంతో కూడిన ఎరువులు తయారు చేసే విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఈవోపీఆర్డి రమణయ్య తెలిపారు. మండలంలోని తట్టబంద సంపద తయారీ కేంద్రం వద్ద గురువారం సర్పంచ్ సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గ్రామంలో పేరుకు పోయిన చెత్తను గ్రీన్ అంబాసిడర్లతో తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రంలో ఎరువును తయారు చేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సంపద తయారీ కేంద్రం ద్వారా మంచి పోషక విలువలతో కూడిన ఎరువును తయారు చేసుకొని పంటలను పండించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నూకరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఇఒపిఆర్‌డి

భూమి వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి గ్రామం వద్ద జిల్లా పరిషత్‌కి సంబంధించిన భూమి వేలంపాటను ఎంపిడిఒ డేవిడ్‌రాజు వాయిదా వేశారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి 50 సెంట్లు భూమి రావణాపల్లి గ్రామంలో ఉంది. ఈ మేరకు ఎంపిడిఒ ఆధ్వర్యంలో ఈ భూమిని మూడు సంవత్సరాలకు ఒక పర్యాయం వేలంపాట నిర్వహిస్తారు. ఈ దఫా రెండు సంవత్సరములకు ఒక పర్యాయంగా నిర్ణయించి గురువారం వేలంపాట నిర్వహించడానికి గతంలో ఎంపిడిఒ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే వేలం పాటలో పాల్గొనే ముగ్గురు ఆసాములు కోరిక మేరకు ఈ వేలం పాటను గురువారం వాయిదా వేసి, ఈ నెల 17న 11 గంటలకు నిర్వహించడానికి నిర్ణయించారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5000 ధరావత్‌గా చెల్లించాలని ఎంపిడిఒ తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని కొర్లప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి గుడివాడ ఫీడర్ మరమ్మత్తు పనులు చేపడుతున్న కారణంగా ఈనెల 7న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈ ఈ రమణమూర్తి తెలిపారు. 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

గ్రామాల్లో ఘనంగా పండగలు

ప్రజాశక్తి-ఎస్. రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేలంపాలెం, జంగుళురులో పైడిమాంబ అమ్మవారి ఉత్సవం సర్పంచ్ శంకర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కర్రివానిపాలెంలో కనకమహాలక్ష్మి అమ్మవారు జాతరను ఘనంగా జరిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

కోటవురట్ల: మండలంలో ఎండపల్లిలో నూకాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.



క్యూలో ఉన్న భక్తులు